సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023




తొమ్మిది మందికి కారుణ్య నియామక పత్రాలు

వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద తొమ్మిది మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. 8లో


వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

స్థానిక ప్రాచీన శ్రీ గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కొలువై ఉన్న శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 8లో



డెల్టా కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం డెల్టా కాలువలకు 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,100, మధ్య డెల్టాకు 400, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.



న్యూస్‌రీల్

వృద్ధాశ్రమానికి విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు

దేవరపల్లి: గొల్లగూడెం సమీపాన లగడపాటి రామలక్ష్మమ్మ రామానాయుడు దివ్యాంగుల, వృద్ధాశ్రమంలో దివ్యాంగ బాలుర శాశ్వత వసతి భవన నిర్మాణానికి గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, విశాఖ స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), సతీమణి పద్మ రూ.2 లక్షల విరాళం అందజేశారు. సోమవారం పల్లంట్లలోని ఆయన ఇంటి వద్ద ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు కాగిత భాస్కరరావుకు విరాళం అందజేశారు. జనార్దనరావు సతీమణి పుష్పావతి జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్యవైశ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వెలగా



శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గోపాలపురం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గోపాలపురం మండలం కోమటికుంటకు చెందిన వెలగా శ్రీరామమూర్తిని ఎంపిక చేసినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్నిక అధికారులు గాదెంశెట్టి శ్రీనివాసరావు, మామిడి వెంకటేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామమూర్తి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, మండల పరిషత్ ఫ్లోర్‌లీడర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాల గోపాలపురం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. శ్రీరామమూర్తిని జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు బొండాడ రాంపండు, ఎన్.బాపిరాజు, నగరగంటి సత్యనారాయణ, గోపాలపురం మండలం ఆర్యవైశ్య, వాసవీ క్లబ్ సభ్యులు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా చందు



మధురపూడి(రాజమహేంద్రవరం సిటీ): వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కోరుకొండకు చెందిన బొండాడ చందు నియమితులయ్యారు. కొన్నేళ్లుగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయనకు పార్టీ ఈ బాధ్యతలు అప్పగించింది. చందు పార్టీ కార్యకలాపాల్లో చురుకైన పాత్రను పోషిస్తున్నారు. నవరత్నాల గురించి ప్రజలకు వివరించడంలో గణనీయ భూమిక పోషించారు. తనకు పదవిరావడానికి కారణమైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు చందు కృతజ్ఞతలు తెలియజేశారు.

సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం



నూతన గృహన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు దంపతులు

నిడదవోలు : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు అన్నారు. పట్టణంలోని తీరుగూడెం జగనన్న కాలనీలో సోమవారం 14వ వార్డుకు చెందిన నల్లల లోవలక్ష్మీ గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన గృహన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ నవరత్నాలు- పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలో ఖరీదైన స్థలాలను ఇవ్వడమే కాకుండా, సొంతంగా ఇంటి స్థలం ఉన్నట్లయితే అర్హులైన వారికి కాలనీ గృహాలు మంజూరు చేశారన్నారు. తద్వారా సొంతింటి కల నెరవేరడానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్ బిర్రె పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా సాగుతూ..

- రబీ సాగుకు రైతుల సన్నద్ధం
- ఖరీఫ్ నష్టం, ఈ–క్రాప్ నమోదులో అధికారులు బిజీ
- అన్నదాతలకు అండగా జగన్ ప్రభుత్వం



రాజానగరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంట నష్టాలను అంచనా వేసి నివేదికలు రూపొందించడంతో పాటు రబీలో పంటలకు ఈ–క్రాప్ బుకింగ్ చేయడంలో జిల్లా అధికార యంత్రాంగం బిజీగా ఉంది. అలాగే ఖరీఫ్ సాగు నుంచి గట్టెక్కిన అన్నదాతలు రబీ సాగుకు సన్నద్ధమయ్యారు. ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వీచిన గాలులకు వ్యవసాయానికి తగిలిన దెబ్బ నుంచి తేరుకుంటూనే రబీ పంటల సాగు వైపు అడుగులు వేస్తున్నారు.

మెట్టలో 15,265 వ్యవసాయ బోర్లు

జిల్లాలో పంట కాలువల ద్వారా డెల్టాలో వరి సాగుకు డోకా ఉండదు. కానీ మెట్ట ప్రాంతంలో రబీలో సాగు సాహసోపేతంగానే ఉంటుంది. ఈ ప్రాంతంలో సాగుకు గోదావరి జలాలను అందించేందుకు ఎత్తిపోతల పథకాలు ఉన్నాగానీ, వాటి నుంచి వచ్చే జలాలు ఎక్కువగా ఖరీఫ్ సీజన్‌కే ఉపయోగపడతాయి. రబీలో ఎక్కువ సాగు జరిగేది బోర్ల సాయంతోనే అనేది వాస్తవం. అందుకనే జిల్లాలో 15,265 వ్యవసాయ బోర్లు ఉండగా వాటిలో 8,455 బోర్లు కూరగాయలు, ఇతర పంటలకు నీటిని అందిస్తుంటాయి. ఇక మిగిలిన 6,810 బోర్లు చాలా వరకూ మెట్ట ప్రాంతంలోనే ఉన్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలో వరి పంట సాగు 56 వేల హెక్టార్లలో జరుగుతుందని అంచనా. అందులో మెట్ట ప్రాంతంలో గొట్టపు బావుల సాయంతో సుమారు 28 వేల హెక్టార్లలో సాగు చేయనున్నారు.



వరి నారుమడి



రబీలో వరి పంటకు ఈ-క్రాప్ బుక్కింగ్ చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

56 వేల హెక్టార్లలో వరి

జిల్లాలో రబీ సీజన్‌లో 56 వేల హెక్టార్లలో వరి పంటను సాగు చేయాలనేది లక్ష్యం కాగా, ఇతర పంటలతో 82 వేల హెక్టార్ల వరకూ సాగు చేయవచ్చని జిల్లా యంత్రాంగం అంచనా వేస్తోంది. వర్షాల కారణంగా కాస్త ఆలస్యమైనా.. వరితో పాటు పొగాకు, మినుము, పెసర, చెరకు వంటివి వివిధ రకాల పంటలను 72 నుంచి 73 వేల హెక్టార్లలో కచ్చితంగా సాగు చేస్తారని భావిస్తున్నారు. రబీ సాగుకు సంబంధించి ఇప్పటి వరకూ 965 హెక్టార్ల వరకు నారుమళ్లు వేశారు. దీనిలో వెయ్యి ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయి. 24 వేల మెట్రిక్ టన్నుల వరకూ ఎరువులను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.

13 వేల హెక్టార్లలో నష్టం

జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వీచిన గాలులకు 13 వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా. ప్రస్తుతం గ్రామ, మండల, డివిజన్ కమిటీలు చేపట్టిన సర్వే ద్వారా ఇప్పటి వరకూ 11 వేల హెక్టార్లలో నష్టం వివరాలు నమోదయ్యాయి. మిగిలిన వివరాలను కూడా 24 గంటలలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది.

26 లోపు కలెక్టర్‌కు నివేదిక



ఖరీఫ్ పంట నష్టం వివరాలను సేకరిస్తూ రబీ పంటలపై కూడా దృష్టి పెట్టాం. రబీ సీజన్‌లో జిల్లాలో 56 వేల హెక్టార్లలో వరిని సాగు చేయనున్నారు. ఇప్పటి వరకూ 965 హెక్టార్ల వరకూ నారుమడులు వేయగా, వాటిలో వెయ్యి ఎకరాలలో నాట్లు పడ్డాయి. ఈ సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా 24 వేల మెట్రిక్ టన్నుల వరకూ నిల్వలున్నాయి. గోకవరం, కోరుకొండ మండలాలలో ప్రస్తుతం ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ జరుగుతోంది. పంట నష్టానికి సంబంధించిన నమోదైన వివరాల ప్రకారం 22 వరకూ రైతు భరోసా కేంద్రాలలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. ఆపై 26 లోగా కలెక్టర్‌కు పూర్తిస్థాయి నివేదిక అందజేయనున్నాం.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

రైతులకు అండగా ప్రభుత్వం



ఖరీఫ్ సీజన్ చివరి సమయంలో కురిసిన భారీ వర్షాలు రైతులకు కొంత అలజడికి గురి చేశాయి. అయితే జరిగిన నష్టానికి జగన్ ప్రభుత్వం సాయంగా నిలబడడంతో రైతులు ప్రస్తుతం రబీ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. జరిగిపోయిన నష్టాల నుంచి తేరుకునేందుకుంటూనే రబీలోనైనా మంచి దిగుబడులు సాధించాలనే సంకల్పంతో పయనిస్తున్నాం.

– పి.రామకృష్ణ, సంపత్‌నగరం, రాజానగరం మండలం మండలం

ఆశలన్నీ రబీపైనే..



భారీ వర్షాలతో ఖరీఫ్ పంటలో జరిగిన నష్టాలను పూడ్చుకుని, ఆర్థిక ఒడుదొడుకుల నుంచి గట్టెక్కేందుకు రైతులు రబీ పంటల సాగు పైనే ఆశలు పెట్టుకున్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో వచ్చే దిగుబడి ఎక్కువగా శిస్తులకే పోతుంది. పండించే కౌలు రైతుకు కాస్తో కూస్తో ఊరటనిచ్చేది రబీ సాగే.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

భవన నిర్మాణాల మీద సెస్ చెల్లింపు

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లుల నుంచి ఒక శాతం సెస్‌ను వసూలు చేసే ప్రతి నెలా నిర్మాణ మండలికి ఆ మొత్తం బదిలీ చేయాలని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెస్ వసూలుపై సోమవారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ నిర్మాణ పనులు చేపట్టే ప్రభుత్వ శాఖల, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం కింద సెస్ చెల్లించవలసి ఉన్నదన్నారు. ప్లాన్ అప్రూవల్ సమయంలోనే సెస్ వసూలు చేసి జమ చేయాలన్నారు. ఆ వివరాలను కార్మిక శాఖకు పంపాలని కోరారు. 2014 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణ పనులు, వసూలుచేసిన సెస్ మొత్తం, జమచేసిన వివరాలు తెలుపుతూ ప్రతి శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ కార్మిక శాఖకు, బోర్డుకు నివేదికలను 10 రోజుల్లోగా పంపాలని ఆదేశించారు.

మాణిక్యాంబా అమ్మవారికి బంగారు చీర



ఈవోకు రూ.లక్ష అందజేస్తున్న మంత్రి వేణు మనవరాలు సునిధి

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బంగారు చీర చేయించాలని సంకల్పించారు. దీనిలో భాగంగా సోమవారం మంత్రి వేణు అమ్మవారి సన్నిధిలో తన మనవరాలు సునిధి చేతుల మీదుగా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావుకు రూ. లక్ష అందించి బంగారు చీర తయారు చేయించే పనులు ప్రారంభించాలని కోరారు. మంత్రి వేణు వెంట రామచంద్రపురం వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శీలం రమణ ఉన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- అధికారుల సమష్టి కృషి అవసరం
- కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాను మాదక ద్రవ్యాల వినియోగ రహితంగా తీర్చిదిద్దుదామని, అందుకోసం సంబంధిత సమన్వయ శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. కలెక్టరేట్ స్పందన హాల్లో సోమవారం ఆమె, ఎస్పీ పి.జగదీష్ అధ్యక్షతన జిల్లాస్థాయి జాతీయ ఔషధ డిమాండ్ తగ్గింపు (ఎన్‌సీఓఆర్‌డీ) కమిటీ సమావేశం జరిగింది. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టడం కోసం సమన్వయ శాఖల అధికారుల సమష్టిగా కృషి చేయాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల మహమ్మారిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఎస్పీతో కలిసి సమన్వయ శాఖలతో సమావేశం నిర్వహించామన్నారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు జరిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి ఆస్తులను, వారి బంధువుల ఆస్తులను కూడా జప్తు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఎంట్రీ పాయింట్ల చెక్ పోస్టులైన గోకవరం, బూరుగుపూడి, కొవ్వూరు, రాజానగరం తనిఖీ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్ డిటెక్షన్ సెంటర్, అడిషనల్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ రెండూ సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు.

నిరోధానికి చర్యలు : ఎస్పీ జగదీష్

ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ గంజాయి అమ్మకాలు, వినియోగాన్ని నిరోధించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలలు, నగర శివారు నివాస ప్రాంతాలు, నదీ తీరాలు, నగరంలో ఇప్పటికే గుర్తించిన పలు ప్రాంతాల వద్ద పోలీసింగ్ బలోపేతం చేశామన్నారు. జిల్లాలో ఏడీపీఎస్ చట్టం కింద 8 కేసులు నమోదయ్యాయని, ఇందులో 6 కేసులు వాణిజ్య పరంగా, 2 కేసులు వాణిజ్యేతరగా పరిగణించామన్నారు. ఇప్పటి వరకూ ఆరు వాహనాలను సీజ్ చేశామని, రూ.40,59,325 విలువైన 811.865 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పరారీలో ఉన్న నలుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఎస్ఈబీ అధికారి పి.సోమశేఖర్, జిల్లా ఫారెస్ట్ అధికారి బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్పందనకు వచ్చిన ప్రతి అర్జీని అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పారదర్శకంగా పరిష్కరించాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్పీ పి.జగదీష్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, డీఆర్ఓ జి.నరసింహులుతో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ స్పందనకు 170 అర్జీలు వచ్చాయన్నారు. ఆన్‌లైన్ 159, ఆఫ్‌లైన్ 11 స్వీకరించినట్టు తెలిపారు.

చర్మ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే

జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: ప్రజారోగ్య సంరక్షణలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి చర్మ వ్యాధులు, నరాలకు సంబంధించిన అనుమానిత కేసులను గుర్తించి వైద్య సేవలు అందించాలని ఆరోగ్య మహిళా కార్యకర్తలను కలెక్టర్ మాధవీలత కోరారు. కలెక్టరేట్ వీసీ హాల్లో సోమవారం తన అధ్యక్షతన జరిగిన జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వార్డు ,గ్రామ సచివాలయాల పరిధిలో ఆశ కార్యకర్తలు, వలంటీర్లు, ఆరోగ్య మహిళా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి చర్మ వ్యాధులు, నరాలకు సంబంధించి బాధితు కేసులను గుర్తించి వైద్య సహాయాన్ని అందించాలన్నారు. ఈనెల 27 నుంచి వచ్చే జనవరి 12 వరకు నిర్వహించనున్న కుష్టువ్యాధి కేస్ డిటెక్షన్ శిబిరానికి ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులందరికీ దీనిపై శిక్షణ ఇవ్వడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. జిల్లా లెప్రసీ,ఎయిడ్స్,టీబీ అధికారి వసుంధర మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల ద్వారా పారా మెడికల్ సిబ్బందికి,ఆశ కార్యకర్తలు,వలంటీర్లు, ఎస్ఎల్ఈపీ నోడల్ పర్సన్స్‌కు శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం అవగాహన పోస్టర్లను కలెక్టర్ మాధవీలత జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, జిల్లా ఎస్పీ జగదీష్, మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రతినిధి ఎమ్.సందీప్, డీపీఓ సత్యనారాయణ, డీపీఆర్ఓ కాశయ్య, జిల్లా స్త్రీశిశుసంక్షేమసాధికారత అధికారి విజయకుమారి, జిల్లా ఆశా ప్రతినిధి అర్జునరావు, డీడీఎంఓ అభిషేక్ రెడ్డి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రత్నగిరిపై పలు భవనాల ప్రారంభం

తొండంగి: అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులను దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం ప్రారంభించనున్నట్టు ఆలయ ఈఓ శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. కొండపై శివసదన్ సత్రం, సత్యనారాయణ యాత్రీనివాస్, సత్యేశ్వరనివాస్, విద్యుత్ శంఖు చక్రనామాలు, వనదుర్గ మార్గ్, సత్యదేవ సర్వీస్ రోడ్డు, విశ్రాంతి భవనం, ఆది శంకర మార్గ్, హరిహర మార్గ్‌లను మంత్రి సత్యనారాయణ ప్రారంభిస్తారని వివరించారు. ఈ సందర్భంగా సిబ్బంది వారంతపు సెలవు పెట్టేందుకు అనుమతులు ఇవ్వలేదన్నారు.



ఆరోగ్యశ్రీపై ఇంటింటికీ విస్తృత అవగాహన

- పథకం పరిమితి రూ.25 లక్షలకు పెంచిన ప్రభుత్వం
- వ్యాధుల సంఖ్యను భారీగా పెంచిన వైనం
- జనవరి 1 నుంచి 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష
- కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్



ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): పేద రోగులకు సంబంధించి వైద్య వ్యయ పరిమితి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కలెక్టర్ మాధవీలత చెప్పారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మెగా ఆరోగ్యశ్రీ అవగాహన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎస్పీ జగదీష్ తదితరులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పించేందుకు కార్డులు, కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. దేశ చరిత్రలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందన్నారు. ఈ పథకం కింద గతంలో కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్స చెల్లించేవారన్నారు. అయితే ఆ మొత్తాన్ని ఇప్పుడు రూ.25 లక్షలకు పెంచారని పేర్కొన్నారు. అందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు ఎటువంటి సందేహాలు రాకుండా ఇంటింటి ప్రచారం చెయ్యడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు పేద వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఆరోగ్యశ్రీ పథకం వార్షిక ఆదాయ పరిమితి ఇప్పుడు రూ.5 లక్షలకు పెంచి మధ్యతరహా కుటుంబాలకు వర్తింపజేస్తున్నారన్నారు. మొబైల్‌లో దిశా యాప్, ఆరోగ్యశ్రీ యాప్‌లను అందరూ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఆరోగ్యశ్రీ కింద 1,057 రకాల వ్యాధులకు మాత్రమే వైద్య సేవలు అందేవన్నారు. ఇప్పుడు 3,257 రకాల రోగాలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో 750 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 2,513కి చేరిందన్నారు. జనవరి ఒకటి నుంచి 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేయనున్నామన్నారు.

దిశయాప్ తరహాలోనే: ఎస్పీ

జగదీశ్ మాట్లాడుతూ దిశా యాప్ తరహాలోనే వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం చేస్తూ ఆరోగ్యశ్రీ యాప్ కూడా డౌన్‌లోడ్ ప్రక్రియ చేపడతామన్నారు. క్షేత్ర స్థాయిలో పోలీస్ అధికారుల ద్వారా సిబ్బందికి సూచనలు జారీ చేస్తున్నామన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం, క్యాన్సర్ వంటి వ్యాధులకు ఎంత ఖర్చయినా చికిత్స అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్ళి ఆరోగ్యశ్రీ అవగాహన కల్పించాలన్నారు. ఇందులోని కొత్త ఫీచర్ల గురించి వివరించాలన్నారు. కార్పొరేషన్ కమిషనర్ కె. దినేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్. ప్రియాంక, డీఎంహెచ్ఓ డాక్టర్ వేంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ సూర్య ప్రభ, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

నా భర్తకు మెరుగైన సాయం



మా ఆయన ఆటో నడుపుతున్నారు. వైద్య పరంగా ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నాం. డా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వ ఆసుపత్రిలో మా ఆయనకు అనారోగ్యం వస్తే వెంటనే మెరుగైన వైద్యం అందచేశారు. కుటుంబ పెద్దదిక్కుగా ఉన్న నా భర్త ఆరోగ్య స్థితి మెరుగు పరిచేందుకు ప్రభుత్వం అందచేస్తున్న సహాయం ఎప్పటికీ మరువను

– జి. సుమాంజలి, రాజమహేంద్రవరం

పాప ప్రాణం నిలబెట్టారు జగన్



నా భర్త ఆటో డ్రైవర్. అతని సంపాదన కుటుంబ ఖర్చులకే అంతంత మాత్రంగా సరిపోతుంది. పాపకు బ్లడ్ క్యాన్సర్. వైద్యం చేయించాలంటే ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి మాది. కానీ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేస్తున్నాం. ముఖ్యమంత్రి జగనన్న పేద ప్రజల ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ చూపిస్తున్నారో మా పాపే నిదర్శనం.

– మహమ్మద్ శ్రేయ, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్‌లో ఐడియల్ ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు(కాకినాడ): జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్ పోటీలో ఐడియల్ ఇంజినీరింగ్ మెకానికల్ విభాగ తృతీయ సంవత్సర విద్యార్థి కె.వెంకట జగదీష్ ప్రతిభ చూపాడు. 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంతో పాటు ఫాస్టెస్ట్ మెన్ ఆఫ్ ది యూనివర్సిటీగా నిలిచాడు. నరసారావుపేటలో నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ మీటర్ అక్వాటిక్ సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీల్లో 1500 మీటర్ల కాంపిటేషన్‌లో సీఎస్‌ఈ ప్రథమ సంవత్సర విద్యార్థి పి.సాయిధనుష్‌రాజ్ ద్వితీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు, కరస్పాండెంట్ చిరంజీవిని కుమారి, ప్రిన్సిపాల్ టి.శ్రీకాంత్ హెచ్‌ఓడీలు అంజిబాబు, ఎంఎస్ ఆర్ఎస్ ప్రసాద్ సోమవారం కళాశాలలో అభినందించారు.

20న జాబ్‌మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. హెచ్‌వన్ హెచ్‌ఆర్ సంస్థలో 500 పోస్టులు, డి మార్ట్ 50, ఫ్లిప్‌కార్ట్‌లో 70 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిగ్రీ విద్యార్హతలు గలవారు హాజరుకావచ్చునన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ.14వేల నుంచి రూ. 32వేల వరకూ ఉంటుందన్నారు. వివరాలకు 0884-2373270 నంబరులో సంప్రదించాలి.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

- బిక్కవోలుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే దంపతులు

బిక్కవోలు : స్థానిక ప్రాచీన శ్రీ గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కొలువై ఉన్న శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు తెల్లవారు జామున 1.20 గంటలకు తీర్థపు బిందె సేవతో ప్రారంభమయ్యాయి. స్వామికి నిత్య పూజల అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. భారీ సంఖ్యలో భక్తులు క్యూ లో బారులు తీరారు. గోదావరి కాలువలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకోవడం ఇక్కడ ఆచారం, దీంతో స్నానఘట్టాలన్నీ జనంతో నిండిపోయాయి. సంతానం లేని వారికి సంతానాన్ని ప్రసాదించే ఈ స్వామి ఆలయంలోని పుట్టపై ఉంచిన నాగుల చీరను ధరించి ఆలయం వెనుక నిదురిస్తే స్వామివారు కలలో సాక్షాత్కరించి సంతానాన్ని ప్రసాదిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. దీంతో సంతానం లేని వారు అధిక సంఖ్యలో ఆలయం వెనుక నాగులు చీర ధరించి నిదురించారు. రాత్రి తొమ్మిది గంటలకు స్వామి వారికి నెమలి వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండ్ మేళాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు తాగునీరు, చిన్నారులకు పాలు, మజ్జిగ, బిస్కెట్లు, పులిహోర పంపిణీ చేశారు. షిర్డీ సాయి సేవాసమితి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు బాణసంచా కాల్పులు తిలకించడానికి ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అనంతరం బ్యాండ్ మేళాలు, కోయ డ్యాన్సులు, గరగ నృత్యాలు, గారడీలతో రాత్రి 11గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 12గంటల నుంచి తెల్లవారు జాము వరకు బాణసంచా కాల్పుల పోటీలు సాగాయి. ఈ పోటీలను తిలకించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. షష్ఠి సందర్భంగా స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, జిల్లా మహిళ స్థాయి సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, బిక్కవోలు ఉపసర్పంచ్ డాక్టర్ మురళీకృష్ణారెడ్డి ఉన్నారు.



తెల్లవారుజామున స్వామివారికి తీర్థపు బిందె తీసుకువెళుతున్న అర్చకుడు



కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



సంతానం కోసం నాగుల చీర ధరించి ఆలయ ప్రాంగణంలో నిదురించిన మహిళలు



బిక్కవోలులో స్వామి దర్శనం కోసం క్యూ లో ఉన్న భక్తులు

ఏకబిగిన 151 పాటల ఆలాపన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక విక్రమహాల్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక సినీ సంగీత విభావరి అలరించింది. ఉదయం 10 నుంచి రాత్రి 10:30 వరకు విరామం లేకుండా 29 మంది ఫిమేల్ సింగర్స్‌తో బర్రే సుబ్రహ్మణ్యం 151 పాటలు పాడి ప్రేక్షకుల్ని ఆనందింపచేశారు. గత ఏడాది డిసెంబర్ 18న 12 గంటలపాటు ప్రోగ్రాం చేసి 117 పాటలు పాడి సుబ్రహ్మణ్యం రికార్డు నమోదు చేశారు. ఇప్పుడు అదే 12 గంటల్లో 151 పాటలు పాడినందుకు సంగీత ఐక్యవేదిక పెద్దలు, సీనియర్ గాయకులు రాయుడు చంద్ర కుమార్, పి.శ్రీహరి, ఏ.సుభాష్, ఎం.సత్యనారాయణ చౌదరి, సీతారామారావు, ఆదిమూలం సాయిబాబా, డి సుబ్రహ్మణ్యం, మణిధర్, సత్యనారాయణ, బ్రహ్మం, శ్రీరామ్, ఘంటసాల రాజు, రాజేశ్వరరావు, ఆదర్శ, డి.ఈ ప్రసాద్ అభినందించారు. ఇన్ని పాటలు ఇంతవరకు మెయిల్ సింగర్ ఎవరూ పాడలేదని చెబుతూ బర్రే సుబ్రహ్మణ్యంను పూల మాలతో సత్కరించారు. ఈసందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తనతో గొంతు కలిపి పాడిన ఫిమేల్ సింగర్స్ కృతజ్ఞతలు తెలిపారు. దీపికా ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రోగ్రాం నిర్వహించారు.



సినీ సంగీత విభావరిలో గీతాలు ఆలపిస్తున్న సుబ్రహ్మణ్యం

తొమ్మిది మందికి కారుణ్య నియామక పత్రాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం –స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద తొమ్మిది మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. వీరిలో ఒక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులోని బాధిత కుటుంబ సభ్యునికి ఉద్యోగ నియామక పత్రం అందించినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. తొమ్మిది మందిలో ఐదుగురిని జూనియర్ సహాయకులుగా, నలుగురిని ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమిస్తూ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వారీగా ఖాళీల సంఖ్య రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చామని కలెక్టర్ కృతికాశుక్లా వివరించారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా అభ్యర్థులు సూచించారు. జేసీ ఇలక్కియ, ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

యానాం జిప్‌మెర్ వైద్య సేవలు ప్రారంభం

యానాం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నిర్మించిన జిప్‌మెర్ మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ సేవలను సోమవారం ప్రారంభించారు. తొలిరోజు జిప్‌మెర్ వైద్య బృందం, సిబ్బంది, సెక్యూరిటీ గార్డుల ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో జ్యోతి వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులకు స్వాగతం పలికారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ప్రజలు ఆసుపత్రిలో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మెడిసిన్, ఎముకలు, ప్రసూతి, గైనకాలజీ విభాగాల సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జిప్‌మెర్ వైద్యులు నోడల్ ఆఫీసర్ డాక్టర్ దిలీప్‌మౌర్య, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్‌రాజ్, డాక్టర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

శనైశ్చరుని హుండీ ఆదాయం రూ.5.51 లక్షలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి ఆలయం హుండీ ద్వారా రూ.5,51,696 ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ ఏసీ, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. 130 రోజుల అనంతరం సోమవారం వివిధ దేవస్థానాల ఈవోలు ఎం.రాధాకృష్ణ, ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు పర్యవేక్షణలో హుండీలను తెరిచి ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల వలంటీర్లు లెక్కించారు. శనైశ్చర స్వామి దేవస్థానానికి సంబంధించి హుండీల ద్వారా రూ.5,51,696, అన్నప్రసాదం ట్రస్టుకు రూ.16,500, ఈ ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయం హుండీ ద్వారా రూ.25,514 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు. కార్యక్రమంలో మందపల్లి వీడీసీ కన్వీనర్ సాధు చెంచయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు అడపా వెంకటేశ్వరరావు, దేవస్థానం ఎస్‌ఏ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏలో మైనార్టీ హక్కుల దినోత్సవం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో మైనారిటీ హక్కుల దినోత్సవం సోమవారం జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ వివిధ సంస్కృతులు, సంప్రదాయాలకు నెలవైన భారతదేశంలో తక్కువ సంఖ్యలో ఉన్న తరగతుల వారిని మైనారిటీలుగా పరిగణిస్తారన్నారు. జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం 1992లోని వివిధ అంశాలపై అవగాహన కలిగివుండాలన్నారు. ఈ చట్టం ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు (జొరాస్ట్రియన్), జైన మతాలకు వర్తిస్తుందన్నారు. భారత రాజ్యాంగంలోని 29, 30 అధికరణలు మతపరమైన, సాంస్కృతిక, భాషాపరమైన మైనారిటీల హక్కులను పరిరక్షిస్తాయన్నారు. వారి వారసత్వం, సంస్కృతిని సంరక్షించడానికి ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ విద్యను అందించేందుకు వీలు కల్పిస్తాయన్నారు. మతం, భాష, సంస్కృతుల ఆధారంగా మైనారిటీల పట్ల వివక్ష చూపించడం తగదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మైనారిటీలకు, సామాన్య ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం 1992, రాజ్యాంగంలోని సంబంధిత అధికరణలపై అవగాహన కల్పించారు. సదస్సులో కాకినాడ జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి బి.నారాయణ, ఏపీ స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ కాకినాడ ఎక్సిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్, రెవెన్యూ, మైనారిటీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

జోడెడ్ల బండిపై దర్శనానికి..

అంబాజీపేట: సంస్కృతి సంప్రదాయాలకు గ్రామీణ ప్రాంతాలు చిరునామాలు అంటే అతిశయోక్తి కాదు. ఈ యాంత్రిక జీవనంలో పెళ్లిళ్లు, పేరంటాలు, విందులు, వినోదాలకు మోటారు సైకిళ్లు, కార్లలో రావటం జరుగుతోంది. అయితే ఇటీవల కాలంలో కొంతమంది సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలనే ఉద్దేశంతో పచ్చి కొబ్బరి తడకలను కట్టిన జోడెడ్ల బండిపై రావడం ఆనవాయితీగా మారింది. దీనిలో భాగంగా సోమవారం మాచవరంలో జరిగిన సుబ్రహ్మణ్య షష్ఠి తీర్థానికి బండారులంకకు చెందిన వాసంశెట్టి రాధాకృష్ణ కుటుంబ సభ్యులు కపిల పుంగనూరు కోడిగిత్తల జోడేడ్ల బండిపై కుటుంబమంతా స్వామి దర్శనానికి సంప్రదాయ బద్ధంగా తరలివచ్చారు. కోడె గిత్తల బండిపై తీర్థానికి వచ్చిన వారిని, బండిని ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు.



షష్ఠి తీర్థానికి వెళుతున్న జోడెడ్ల బండి

నాన్‌స్టాప్ సాహిత్య ఉత్సవాలకు పలు రికార్డులు

సఖినేటిపల్లి: తాడేపల్లి గూడెం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో గత రెండు రోజులుగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 30 గంటల పాటు నాన్‌స్టాప్‌గా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు పలు ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్నాయి. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో 1500 మంది కవులు, కళాకారులతో 17, 18 తేదీల్లో నాన్‌స్టాప్‌గా నిర్వహించిన నిర్విరామ ఈ ఉత్సవాలను ధ్రువీకరిస్తూ ఆయా సంస్థలు రికార్డులు నమోదు చేశాయి. ఈ మేరకు భారత్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్, ఇంటర్నేషనల్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు అసోసియేషన్ బుక్ ఆఫ్ రికార్డ్, మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో కళా ఉత్సవాల నిర్వహణ రికార్డులు నమోదయ్యాయి. సోమవారం వివరాలను ప్రతాప్ మీడియాకు తెలిపారు. ప్రతాప్ పర్యవేక్షణలో స్థానిక కళావేదిక ఏర్పాటు చేసిన సాహిత్య సాంస్కృతిక ర్యాలీని ముఖ్యఅతిథి హోంమంత్రి తానేటి వనిత జెండా ఊపి ప్రారంభించారు. ముఖ్య అతిథి, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు హాజరై ప్రతాప్‌ను స్థానిక కళావేదిక టీం సిద్ధం చేసిన ఆత్మీయ జ్ఞాపికను బహూకరించారు. కవులను, కళాకారులను ఒక చోటకు చేర్చిన ప్రతాప్‌ను అభినందించారు.



తాడేపల్లిగూడెంలో ప్రతాప్‌ను ఆత్మీయ జ్ఞాపికతో అభినందిస్తున్న కొమ్మినేని

25 నుంచి కెనాల్ రోడ్డుకు మరమ్మతులు

అనపర్తి: ఈ నెల 25 నుంచి వేమగిరి–సామర్లకోట కెనాల్ రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కెనాల్ రోడ్డు అభివృద్ధి జరగకపోవడానికి గత టీడీపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కెనాల్ రోడ్డు అభివృద్ధికి రూ.220 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే పనులు ప్రారంభించే సమయానికి అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం రోడ్డు అభివృద్ధికి టెండర్ దక్కించుకున్న సంస్థతో కుమ్మక్కై మొబలైజేషన్ అడ్వాన్స్ కింద పెద్ద మొత్తంలో నిధులు దోచుకున్నారని విమర్శించారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వ నేతలు చేసిన పాపం ఇప్పుడు ప్రయాణికులకు శాపంగా మారిందన్నారు. కెనాల్ రోడ్డు గోతులమయంగా మారడంతో గతంలో రెండు పర్యాయాలు ప్రభుత్వ నిధులతో, ఒకసారి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తన సొంత సొమ్ముతో మరమ్మతులు చేయించారన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే మరోసారి తన సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారని చెప్పారు.



వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి

కేబుల్ వైరు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ఉండ్రాజవరం: గ్రామంలో జియో కంపెనీ ఎలక్ట్రికల్ మెటీరియల్స్ స్టోర్స్ రూమ్‌లో కేబుల్ వైర్లు దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై కె.రామారావు తెలిపారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన చాలా మహేష్ గత సెప్టెంబర్ నెలలో 130 మీటర్ల కేబుల్ వైర్లను దొంగిలించడంతో కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి సుమారు రూ.15 వేల విలువ గల జియో కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రామారావు తెలిపారు. ముద్దాయిని అరెస్ట్ చేసిన ఎస్సై కె.రామారావు, సిబ్బంది ఎస్.నాగేశ్వరరావు, బుజ్జి, ముత్యాలరావు, రాజు, త్రినాథ్‌లను కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ అభినందించారు.

23న యోగా పోటీలు

రాయవరం: విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న యోగాసనాల పోటీలను రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. యోగాసనాలతో పాటుగా 108 సూర్య నమస్కారాలు, భగవద్గీత శ్లోకాల పోటీలను కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలల, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మానవతా సంస్థ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 996667311 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 గ్రాండ్ ఫినాలే



వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 గ్రాండ్ ఫినాలే కార్యక్రమం జరగనున్నట్టు ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, ఏఐసీటీఈ ఈ ఈవెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ గ్రాండ్ ఫినాలేలో 27 జట్లు పాల్గొంటున్నాయని, ఒక్కొక్కటి 5 సమస్య ప్రకటనలను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. సృజనాత్మక పరిష్కారాలను కనుగొనడానికి, వారి నైపుణ్యాలను ఉపయోగించుకొనేలా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి 36 గంటల పాటు నిర్విరామంగా కార్యక్రమం సాగుతుందన్నారు. గ్రాండ్ ఫినాలేకు దేశంలో ప్రతిష్టాకరమైన 47 నోడల్ కేంద్రాలలో ఒకటిగా ఆదిత్య కళాశాలకు స్థానం దక్కడం గర్వంగా ఉందన్నారు.

శివసదన్ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



ఈఓ శ్రీనివాసమూర్తికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న దాత శ్రీలేఖ

తొండంగి: అన్నవరం సత్యగిరి కొండపై శివసదన్ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన దాత ఎస్.శ్రీలేఖ రూ.10 లక్షల విరాళం సమర్పించినట్టు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి సోమవారం తెలిపారు. శివసదన్‌లో 328 సూట్ నిర్మాణం కోసం ఎస్.శంకరరావు, సీతామహలక్ష్మి పేరున ఈ విరాళం ఇచ్చినట్టు వివరించారు.

గోదావరిలో మునిగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం గ్రామానికి చెందిన గద్దే నాగరాజు (54) గోదావరిలో ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. నాగరాజు ప్రతి రోజు గోదావరి నది దాటి లంకలోకి పశువులను తోలుకు వెళుతూ ఉంటాడు. ఆదివారం పశువులను తోలుకుని వెళుతూ గోదావరిలో ప్రమాదవశాత్తూ మునిగి మృతిచెందాడు. సోమవారం పేరవరం సమీపంలో గోదావరి వద్ద మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి అల్లుడు గారపాటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మురుగు కాలువలో పడి మహిళ మృతి

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం అన్నదేవరపేట గ్రామాల మధ్యలో ఉన్న మురుగునీటి కాలువలో గుర్తు తెలియని ఒక మహిళ మృతదేహం సోమవారం వెలుగు చూసింది. కాలువలో మృతదేహం తేలుతున్నట్టు తాళ్లపూడి పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై కె.వెంకట రమణ ఘటనా ప్రదేశానికి చేరుకుని విచారణ చేపట్టారు. అన్నదేవరపేటకు చెందిన పోసిన ప్రసన్న (32) మృతదేహంగా గుర్తించారు. భర్త విజ్జు సత్యనారాయణను వదిలేసి మతి స్థిమితం లేకుండా ఉంది. గ్రామానికి చెందిన ఆమె బంధువులు పోసిన ఉమా మహేశ్వరరావు, ప్రక్కిలంకకు చెందిన బంధువు దగ్గర ఉంటోంది. మతి స్థిమితం లేకుండా తిరుగుతూ ఆదివారం సాయంత్రం కాలువలో పడిపోయిందని ఎస్సై తెలిపారు. బంధువులకు తెలిసి సమాచారం మేరకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ముమ్మిడివరం: మండలంలోని గాడిలంకలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం గోదావరి తీరం వెంబడి లంక గ్రామాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఎన్.కొండయ్య ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.34 వేల నగదు, రెండు మోటారు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కిర్లంపూడి: వ్యక్తి అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైనట్టు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు. మండల పరిధి రామకృష్ణపురం గ్రామానికి చెందిన గొడె సతీష్ తన భార్యతో గొడవ పడి ఈ నెల 15న బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో సతీష్ తండ్రి గొడే వీరన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై రామకృష్ణ తెలిపారు.